
# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 1 సంచిక: 5 ఏప్రిల్ – 2025 పేజీలు: 24




విద్య మా హక్కు
సర్వ శిక్షా అభియాన్
అందరూ చదవాలి-అందరూ ఎదగాలి

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్షా
ఆంధ్రప్రదేశ్

# సమగ్ర విద్యకు పాతికేళ్లు

సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర

# విమర్శకులు మెచ్చిన విద్యార్థులకు నచ్చిన యూనిఫాం



**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయరామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**డా. కృతికా శుక్లా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్షా
**సలహాసభ్యులు**
**వి.ఎన్.మస్తానయ్య,** డైరెక్టర్, SIEMAT
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD -1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD -2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్, CMO
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**సబ్ ఎడిటర్**
**గణేశ్ బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. ఎ.సుహాసిని,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**డీటీపీ & సహకారం**
**కె.అభిషేక్**
**చిత్రకారులు**
**మల్లిక్**

# మన బడి

## మాస పత్రిక



సంపుటి: 1 సంచిక: 5 ఏప్రిల్ - 2025 పేజీలు: 24

## సమగ్ర శిక్షా ప్రస్థానం..
## సమగ్ర విద్యతోనే ప్రయాణం

చదువులమ్మ చెట్టు నీడ నాకు తోడూనీడగా నిలిచింది. అక్షరాన్ని అందరికీ పంచే బాధ్యులలో ఒకడిని చేసింది. విద్యా వికాసానికి కృషిచేసే బృహత్తర ఉన్నతోద్యోగం నాకు దక్కిన వరంగానే భావిస్తాను. సమగ్ర శిక్షాకు పాతికేళ్లు పూర్తయిన శుభవేళ సమగ్ర విద్యా ప్రయాణంలో నేనూ భాగమైనందుకు చాలా సంతోషంగా ఉంది.

*"Education is not just about going to school and getting a degree. It's about widening your knowledge and absorbing the truth about life." - Shakuntala Devi*

హ్యూమన్ క్యాలిక్యులేటర్‌గా పేరుగాంచిన శకుంతలా దేవి గారు చెప్పినట్టు "విద్య అంటే కేవలం పాఠశాలకు వెళ్లి, పరీక్షలు రాసి, డిగ్రీ పొందడం మాత్రమే కాదు. జ్ఞానం సముపార్జించడం, జీవితం గురించిన వాస్తవాలు తెలుసుకోవడం కూడా"

ఇటువంటి సమున్నత లక్ష్యంతో 'సర్వశిక్షా అభియాన్'ను 2001 సంవత్సరంలో భారత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించారు. పేరు మారి 'సమగ్ర శిక్షా' అయినా.. 6–14 సంవత్సరాల బాలలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను ప్రాథమిక హక్కుగా మార్చింది ఈ పథకం.

కేంద్ర ప్రభుత్వం సహకారంతో ప్రీ-స్కూల్ విద్య, వృత్తి విద్య, డిజిటల్ విద్య, క్రీడలు, శారీరక విద్యలను రాష్ట్రప్రభుత్వం అందిస్తోంది. టీచర్ &టెక్నాలజీ శిక్షణపై దృష్టి సారించింది. తద్వారా అన్ని స్థాయిలలో అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం ఒక ప్రణాళికబద్ధంగా అమలు చేస్తూ ఫలితాలు సాధిస్తోంది. సమగ్రశిక్షా 25 ఏళ్ల సమగ్ర విద్యావికాస ప్రయాణంలో భాగమైన ప్రభుత్వం, అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు కృతజ్ఞతలు..

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్షా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/samagrashiksha/ మరియు cse.ap.gov.in



# బాలికలకు సురక్ష

* కిశోర బాలికలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు
* ఒక్క రోజు కూడా బడి మానేయకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యం
* సిగ్గు పడకుండా స్వేచ్ఛగా.... స్టే ఫ్రీ డ్రీమ్స్
* అడ్డంకిని అధిగమించి... హ్యాపీ పీరియడ్స్....

**బా**ల్యం ప్రతి ఒక్కరికి ఎంతో అమూల్యం. చిట్టితల్లులు ఆడుతూ పాడుతూ స్వేచ్ఛగా ఎదిగే వయస్సు. అయితే బాల్యం నుంచి కౌమారంలోకి అడుగుపెట్టే ప్రతి ఆడబిడ్డ 'పీరియడ్స్' (రుతుస్రావం) సమస్య ఎదుర్కొంటూనే ఉంటారు. శరీరంలో హార్మోన్ల మార్పుతో పీరియడ్స్ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. ఇది అత్యంత సాధారణ విషయం. పీరియడ్స్ సహజమైన, ఆరోగ్యకరమైన ప్రక్రియ అయినా నలుగురిలోకి వెళ్లేందుకు అసౌకర్యంగా, ఇబ్బందిగా ఫీల్ అవుతారు. అంతేకాకుండా తమకు ఇష్టమైన ఆటలు ఆడుకోలేని సందిగ్ధత.

## ఇప్పటికీ ఒక సమస్యగానే...

బాల్యం నుంచి యవ్వనంలోకి అడుగుపెట్టే కౌమార దశ చాలా కీలకం. ఈ క్రమంలో బాలికల్లో జరిగే రుతుస్రావ ప్రక్రియ వారిలో శారీరకంగా, మానసికంగా చాలా మార్పులే తీసుకువస్తాయి. ఇది తప్పనిసరి వ్యవహారమే అయినా బయటకు చెప్పుకోడానికి సిగ్గుపడుతున్నారు. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంత బాలికల విషయానికి వస్తే పీరియడ్స్ ను వారు ఇప్పటికీ ఒక సమస్యగానే భావిస్తున్నారు. ఆ సమయంలో బడితో పాటు శారీరక వ్యాయామానికి దూరంగా ఉంటున్నారు.

## స్టే ఫ్రీ డ్రీమ్స్...

ఓవైపు చదువుతో పాటు మరోవైపు శరీరంలో వచ్చే మార్పులతో బాలికలు గందరగోళానికి గురవుతూ... పీరియడ్స్ వల్ల బడికి దూరంగా ఉండే పరిస్థితి. ఇది గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ. అందుకు పేదరికం కూడా ఓ కారణం. గతంలో ప్యాడ్స్ అందుబాటులో లేక క్లాత్ (పాతబట్ట)ను వాడేవారు. అయితే వాటిని మార్చుకోవడానికి, పడేయడానికి ఇబ్బందే. శానిటరీ ప్యాడ్స్ కొనుక్కునే ఆర్థిక స్తోమత లేకపోవడంతో పాటు బడిలో సౌకర్యాలు లోపించటంతో చాలామంది ఇంటికే పరిమితం అవుతున్నారు. బాలికలు తాము కన్న కలలు సాకారం చేసుకునేందుకు 'అయిదు రోజుల' అడ్డంకిని అధిగమించి విద్యలో ముందుకు సాగిపోయేందుకు శానిటరీ ప్యాడ్ ది కీలకపాత్రే. ఈ సమస్యకు పరిష్కారంగా రాష్ట్ర ప్రభుత్వం 'బాలికా రక్ష' పథకం ద్వారా ఉచితంగా శానిటరీ ప్యాడ్లు అందజేస్తోంది.

## శానిటరీ ప్యాడ్స్ అంటే...

శానిటరీ అంటే శుభ్రమైన, ఆరోగ్య భద్రతను అందించేదని అర్థం. శానిటరీ ప్యాడ్స్ మామూలు క్లాత్ లా కాకుండా... తేమను గ్రహించి తాజా అనుభూతిని కలిగిస్తుంది. వాసనను లాక్ చేసి మరకలను నివారించి, సౌకర్యంగా ఉంచుతుంది. ఓవైపు టెక్నాలజీలో దూసుకుపోతున్న ఈ ఆధునిక కాలంలోనూ పీరియడ్స్, శానిటరీ ప్యాడ్స్ గురించి బహిరంగంగా మాట్లాడలేని పరిస్థితి ఇంకా.

## బాలికా 'రక్ష'

కిషోర బాలికలు పీరియడ్స్ ఇబ్బందులతో ఒక్కరోజు కూడా బడి మానేయకుండా ఉచితంగా శానిటరీ ప్యాడ్స్ అందించడం ఈ 'బాలికా రక్ష' ప్రధాన లక్ష్యం. విద్యకు ఎలాంటి విఘాతం కలగకుండా వారి బంగారు భవిష్యత్తుకు భరోసాగా నిలుస్తూ 'బాలిక రక్ష' పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం కింద సమగ్ర శిక్ష 6 నుంచి 12వ తరగతి విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు అందజేస్తోంది. దీనికి అయ్యే వార్షిక వ్యయం రూ.38 నుంచి 39 కోట్లు. ఈ పథకం ముఖ్య ఉద్దేశం బాలికల ఆరోగ్యంతో పాటు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం. బాలికలకు 'రక్ష'గా ఉండే ఈ పథకం



ద్వారా పీరియడ్స్ సమయంలో బడికి గైర్హాజరును గణనీయంగా తగ్గించాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది.

## 'హ్యాపీ పీరియడ్స్'

అసౌకర్యం అనేది మనసుకైనా... శరీరానికైనా ఇబ్బందిగానే ఉంటుంది. ఇది వారి దినచర్యతో పాటు, హక్కులకు, స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తుంది. అలాంటప్పుడు ఏ పని మీద ఏకాగ్రత ఉండదు. శరీరంలో జరగబోయే, జరిగే మార్పులపై ముందుగానే బాలికలకు అవగాహన కల్పిస్తే, పీరియడ్స్ లో ఉండే రక్తస్రావం, నొప్పిని, అసౌకర్యాన్ని ధైర్యంగా ఎదుర్కొంటారు.

పీరియడ్స్ మొదలు కాగానే ఆందోళన చెందక, సహజమైన ప్రక్రియగా స్వీకరించి ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లితే ప్రతి బాలికకు 'హ్యాపీ పీరియడ్స్' యే కిషోర బాలికలు మానసికంగా, శారీరకంగా పరిపూర్ణంగా ఎదిగితేనే ఆరోగ్యకరమైన భావితరాన్ని సమాజానికి అందించేలా ప్రభుత్వ లక్ష్యం నెరవేరినట్లే.

– **వై. పార్వతి**, సీనియర్ జర్నలిస్ట్

## ఈ పథకం ద్వారా ..

1. మూడు నెలలకు ఒకేసారి విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు పంపిణీ
2. ప్రతినెల 10 చొప్పున ఏడాదికి 120 న్యాప్‌కిన్స్ విద్యార్థినులకు అందచేత
3. ఈ పథకం ద్వారా సుమారు 10 లక్షల మంది విద్యార్థినులకు లబ్ధి
4. వేసవి సెలవులకు ముందే ప్యాడ్స్ అందివ్వడం.




## బాలికలు స్వేచ్ఛగా మాట్లాడుతున్నారు

బాలికలు తమ శరీరంలో వచ్చే మార్పులు గురించి సిగ్గు పడకుండా స్వేచ్ఛగా మాట్లాడే వాతావరణం కల్పిస్తున్నాం. దాంతో వారి భయాలు, అపోహలు తొలగిపోయి తమలో వచ్చే మార్పులు అర్థం చేసుకుంటున్నారు. పీరియడ్స్ తో పాటు ప్యాడ్స్ ఎలా ఉపయోగించాలి, పరిశుభ్రతతో పాటు ఇన్ఫెక్షన్స్ రాకుండా ఎంత సమయంలో మార్చుకోవాలి. వాడిసిన ప్యాడ్స్ ఎలా పడేయాలో కూడా అవగాహన కల్పిస్తాం. బాలికల మూడ్ స్వింగ్స్ అర్థం చేసుకుని వారిని రెస్ట్ రూమ్ కు పంపిస్తాం. వారు అడిగితే వేడివేడిగా సూప్స్ కూడా తయారు చేసి ఇస్తాం. బాలికల ఎత్తు, బరువు ప్రామాణికంగా వారికి ప్యాడ్లు అందచేస్తున్నాం.

– **హెలెన్ జోషి,** ప్రిన్సిపాల్,
కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, డోన్, నంద్యాల జిల్లా

## చదువుపై శ్రద్ధ పెడుతున్నాం

ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ ప్యాడ్లు ఇవ్వడం సంతోషంగా ఉంది. మెచ్యూర్ అయిన ప్రతి బాలికకు నెలకు పెద్దవి నాలుగు, చిన్నవి మూడు ప్యాడ్లు ఇస్తున్నారు. దీనివల్ల పీరియడ్స్ సమయంలో మేము ఎలాంటి అసౌకర్యం లేకుండా, ఇన్ ఫెక్షన్లు రాకుండా ఉండగలుగుతున్నాం. చదువు మీద శ్రద్ధ పెట్టగలగుతున్నాం. ప్యాడ్లు కొనుక్కునేందుకు మా కుటుంబానికి ఆర్థిక ఇబ్బంది లేకుండా ఉచితంగా అందిస్తున్న ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నాం.

– **పి. చరిత,** 9వ తరగతి విద్యార్థిని (కేజీబీవీ, డోన్)

## ప్యాడ్లు నాణ్యత మెరుగుపడాలి

మా కేజీబీవీలో మొత్తం 280 విద్యార్థినులు ఉంటే వారిలో 240మందికి ఉచితంగా శానిటరీ ప్యాడ్లు అందిస్తున్నాం. అయితే నాణ్యతలో కొంతమేరకు ఫిర్యాదులు ఉన్నాయి. వాటిని మెరుగుపరిస్తే బాగుంటుందని మా అభిప్రాయం. పీరియడ్స్ ప్రారంభానికి ముందే బాలికలకు సైన్స్ ఉపాధ్యాయినిలతో పాటు స్థానిక ఏఎన్ఎంల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– **శ్యామల,** ప్రిన్సిపాల్
(కేజీబీవీ రెడ్డిగూడెం ), ఎన్టీఆర్ జిల్లా

# విద్యార్థుల భవిష్యత్తుకి **'పొగ'** పెట్టొద్దు



* టీచర్ల ప్రవర్తన బడిలోనూ, బయట ఆదర్శంగా ఉండాలి

## విద్యాసంస్థల్లో పొగాకు ఉత్పత్తులు, డ్రగ్స్ పూర్తిగా నిర్మూలించే ప్రభుత్వ లక్ష్యానికి అందరి సహకారం అవసరం

గురుదేవోభవ అన్నారు... గురువు దైవముతో సమానమే కాదు.. ప్రతి ఒక్కరికీ ఆదర్శం కూడా. పాఠాలు చెప్పే గురువుగారిని ఆదర్శంగా తీసుకోవడమే కాకుండా ఆయన నడవడిక, అలవాట్లను విద్యార్థులు అనుసరిస్తారు. ఉత్తమ వ్యక్తిత్వం గల ఉపాధ్యాయుడు, ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్దగలడు. నవ సమాజాన్ని నడిపే మేథో సంపదైన విద్యార్థులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుడు జాతి నిర్మాత. విద్యార్థులకు ఆదర్శంగా నిలిచే గురువులే చెడు వ్యసనాలకు బానిసైతే ఆ ప్రభావం పూర్తిగా విద్యావ్యవస్థ, సమాజంపై పడుతుంది.

## మాదకద్రవ్యాల కట్టడికి `ఈగల్`


పొగాకు అలవాటు ఏ ఉపాధ్యాయుడికి ఉన్నా, అది పాఠశాలలో కనిపించినా ఆ ప్రభావం విద్యార్థులపై పడుతుంది. టీచర్లు సిగరెట్, బీడీ తాగడం చూసిన విద్యార్థులు తామూ తాగొచ్చనే దురాలోచన మనస్సులో నాటుకుంది. పొగ తాగడం ద్వారా క్రమేపీ మాదకద్రవ్యాలను అలవాటు చేసుకుంటున్నారు విద్యార్థులు, యువత. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి సారథ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్రంలో మాదకద్రవ్యాల ఉనికి లేకుండా సమూలంగా నాశనం చేయాలని ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది. `ఈగల్` టీమ్‌ని ఏర్పాటు చేసింది. విద్యాసంస్థలను పొగాకు రహితంగా మార్చి తద్వారా విద్యార్థులను మాదకద్రవ్యాలకు దూరం చేయడానికి ప్రభుత్వం కృషిచేస్తోంది.


## ప్రమాదకరంగా సర్వే ఫలితాలు

గ్లోబల్ యూత్ టొబాకో సర్వే ప్రకారం 13 నుంచి 15 ఏళ్ల వయస్సున్న విద్యార్థుల్లో 18 శాతం మంది పాఠశాల విద్యార్థులు ఏదో ఒక విధమైన పొగాకు ఉత్పత్తులు వాడుతున్నారని తేలింది. ప్రతి రోజూ ఐదు వేల మంది విద్యార్థులు టొబాకో వైపు ఆకర్షితులవుతున్నారు. ప్రతి సంవత్సరం 1.35 మిలియన్ మంది పొగాకు, పొగాకు పదార్థాల సేవనం వల్ల చనిపోతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెబుతున్నాయి.

## టొబాకో ఫ్రీ విద్యాసంస్థలే లక్ష్యంగా..

కేంద్ర ప్రభుత్వం విద్యాసంస్థల నుంచి పొగాకు, పొగాకు పదార్థాలను దూరం చేయడానికి వివిధ మార్గదర్శకాలు రూపొందిచింది. ఇందులో భాగంగా దేశంలోని పాఠశాలల్లో అమలు చేయాల్సిన ఇంప్లిమెంటేషన్ మాన్యువల్ టొబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్ పేరుతో మార్గదర్శకాలు విడుదల చేసింది. ముఖ్యంగా పాఠశాలల్లో టొబాకో మానిటర్ ను నియమించి పొగాకు నిషేధం, సేవనంపై పర్యవేక్షణ తప్పనిసరి చేసింది. దీని ద్వారా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు కూడా పొగాకు సేవిస్తే తెలుసుకునే అవకాశం కలిగింది. కేంద్ర ప్రభుత్వం






ఆధ్వర్యంలో నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాంను దేశవ్యాప్తంగా 2007లోనే ప్రారంభించారు.

## చట్టాలు-నిబంధనలు

THE CIGARETTES AND OTHER TOBACCO PRODUCTS (PROHIBITION OF ADVERTISEMENT AND REGULATION OF TRADE AND COMMERCE, PRODUCTION, SUPPLY AND DISTRIBUTION) ACT, 2003 (COTPA 2003) సిగరెట్లు మరియు ఇతర పొగాకు ఉత్పత్తులు ( వాణిజ్యం ప్రకటనల నిషేధం మరియు వాణిజ్య, వ్యాపార ఉత్పత్తి, సరఫరా పంపిణీ నియంత్రణ ) చట్టం, 2003 సెక్షన్ 6 బి ప్రకారం మైనర్లకు టొబాకో ఉత్పత్తులు అమ్మకంపై నిషేధం ఉంది. విద్యా సంస్థలకు 100 గజాల దూరంలో ఎటువంటి పొగాకు ఉత్పత్తులు అమ్మరాదని నిషేధం విధించారు.

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) సంస్థ రెగ్యులేషన్స్ ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006 ప్రకారం ఆహార పదార్థాల్లో టొబాకో నికోటిన్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించింది.

జువైనల్ జస్టిస్( కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్) యాక్ట్, 2015 సెక్షన్ 77 ప్రకారం పిల్లలకు మత్తు పదార్థాలతో పాటు టొబాకో ఉత్పత్తులు ఇవ్వడం నిషేధం, ఈ నేరం రుజువైతే ఏడేళ్ల కారాగార శిక్ష వరకూ విధించవచ్చు.

భారతీయ న్యాయ సంహిత, 2023లో సెక్షన్ 270, 271,280 ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పొగాకు వినియోగం ప్రస్తావన ఉంది. సెక్షన్ 223, 274, 275, 123 పాన్ మసాల, గుట్కా, ఇతర పొగాకు పదార్థాల నియంత్రణకు ఉద్దేశించినవే.

## సమాజంలో పరివర్తనతో ఫలితాలు

చట్టాలు నిబంధనలు ఎన్ని ఉన్నప్పటికీ సమాజంలో పరివర్తనతోనే మంచి ఫలితాలు సాధించగలం. పాజిటివ్ పాసివ్ బిహేవియర్ ద్వారా మానవ పరివర్తనలో మార్పులను తీసుకురావచ్చు. కేంద్రీయ విద్యాలయ సంఘటన కూడా దేశవ్యాప్తంగా నడుస్తున్న పిఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాల్లో పొగాకు నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేస్తోంది. ప్రతీ విద్యాలయంలో సీసీ టీవీలను ఏర్పాటు చేసి సిబ్బంది, విద్యార్థుల ప్రవర్తనను పర్యవేక్షించడం జరుగుతోంది. ఇదే విధంగా విద్యా సంస్థల నుంచి, విద్యార్థుల నుంచి, ఈ సమాజం నుంచి చెడు వ్యసనమైన పొగాకును దూరం చేయడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి. సమాజంలో మార్పు ఏ ఒక్కరి ద్వారా రాదు, ఇది సమిష్టి కృషితో సాధించుకోవాలి.





– **షఫీ మహమ్మద్,** IIS

సహాయ సంచాలకుడు,

దూరదర్శన్, విజయవాడ.

9912277786


బొమ్మలు: **ప్రేమ్ చంద్**



# సాంఘిక భావోద్వేగ అభ్యాసం - విభిన్న నైపుణ్యాలు

కౌమారదశ అనేది విద్యార్థులు వివిధ శారీరక, మానసిక, సామాజిక సవాళ్లను ఎదుర్కొనే దశ. ఈ సమయంలో, వారి భావోద్వేగ స్థితి చాలా సున్నితంగా ఉంటుంది. వారు తమ బలాలు, సామర్థ్యాలను గుర్తించి జీవితంలో మంచి ఎంపికలు చేసుకోగలిగితే, అది వారి భవిష్యత్తుకు బలమైన పునాదిని వేస్తుంది. జాతీయ విద్యా విధానం 2020 కూడా పాఠశాల విద్యలో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సు అవసరాన్ని నొక్కి చెబుతోంది. విద్యార్థులు ఈ బలాలను అర్థం చేసుకోవడానికి, అభివృద్ధి చేయడానికి సహాయం చేయడం చాలా అవసరం.

### భావోద్వేగ స్థితిస్థాపకతకు కొన్ని ముఖ్యమైన నైపుణ్యాలు:

* వినే నైపుణ్యాలు * భావోద్వేగ అవగాహన

* సంభాషణ నైపుణ్యాలు * సంబంధాలను బలోపేతం చేయడం

* సమస్య పరిష్కారం * సంఘర్షణ నిర్వహణ


ముందుగా వినే నైపుణ్యాల గురించి తెలుసుకుందాం. మనం ప్రతిరోజూ వింటాం, కానీ కేవలం వినడానికి, నిజంగా వినడానికి తేడా ఉందా? ఒక కథ ద్వారా దీనిని అర్థం చేసుకుందాం.

''రాధ, రమేష్ పాఠశాలకు వెళుతుండగా, వారు చాలా విచారంగా ఉన్న సంగీతను కలిశారు. రాధ ఆమెను ఏమైందని అడిగింది. సంగీత కొన్ని రోజులుగా తన తండ్రి ఆరోగ్యం బాగా లేదని, అతను ఏమీ తినడం లేదని చెప్పింది. ఆయన్ని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లిందా అని అడిగింది, దానికి సంగీత డాక్టర్ని కలిశాము, కానీ అది ఉపయోగం లేదని, వారు అతన్ని ఎక్కువ ఫీజులు వసూలు చేసే నగరానికి తీసుకెళ్లవలసి ఉంటుందని చెప్పింది. అయితే తన మామయ్య రమేష్ నగరంలో ప్రముఖ వైద్యుడు అని రాధ ఆమెను చింతించవద్దని హామీ ఇచ్చింది, వారు రమేష్‌ను దాని గురించి అడగవచ్చని సూచించింది. రాధ రమేష్‌తో దీని గురించి చర్చిస్తున్నప్పుడు, అతను అకస్మాత్తుగా ఒక చెట్టుపై పండిన మామిడి పండ్లను చూసి అవి ఎంత రుచికరంగా ఉంటాయో అని అన్నాడు. దీనివల్ల రాధ మౌనంగా ఉండిపోయింది. ఆమె మౌనాన్ని గమనించిన రమేష్, ఎందుకు మాట్లాడటం ఆపేసావని అడిగాడు. పాఠశాల నుండి తిరిగి వస్తున్నప్పుడు, ఇలాంటిదే జరిగింది. రాధ ఏదో ఒకటి చెబుతుంది లేదా ప్రశ్న అడుగుతుంది, కానీ ఆమె తన వాక్యాన్ని పూర్తి చేసేలోపే, రమేష్ తన సొంత విషయాల గురించి మాట్లాడటం ప్రారంభించేవాడు. అతను ఎప్పుడూ తన మాట వినడని, తన గురించి మాత్రమే మాట్లాడుతాడని రాధ తన నిరాశను వ్యక్తం చేసింది. తరువాత, రమేష్ తన రోజు సంఘటనలను తన తల్లితో పంచుకున్నాడు, రాధ అతను తన మాట వినలేదని ఎందుకు అనుకుందో అని ఆశ్చర్యపోయాడు. అతను ఆమెతో ఈ మధ్య మాట్లాడుతున్నప్పుడు ఆమె కూడా అలాగే భావించిందని అతని తల్లి చెప్పింది. ఆశ్చర్యపోయిన రమేష్, ఎందుకు అని అడిగాడు. అతను ఆమెతో మాట్లాడినప్పుడు, అతను ఆమె వైపు చూడలేదని, స్పందించలేదని చెప్పాడు. అతను తన సొంత విషయాల గురించి మాట్లాడటం ప్రారంభించాడని అతని తల్లి వివరించింది. అతను అస్సలు వినడం లేదని అనిపించింది. వినడం అంటే మీ చెవులు మాత్రమే కాకుండా మీ మొత్తం శరీరాన్ని ఉపయోగించి మాట్లాడే వ్యక్తితో పూర్తిగా నిమగ్నం కావడం. చాలా మంది వినడం అంటే శబ్దాలు వినడం మాత్రమే అని అనుకుంటారు, చెవులు, కళ్లు, హృదయం, మనస్సును ఉపయోగించడం.

### ఆసక్తిగా వినడం అంటే ఇలా

- మాట్లాడే వ్యక్తిని అంతరాయం కలిగించకుండా చెవులతో శ్రద్ధగా ఏకాగ్రతగా వినడం.
- మాట్లాడే వ్యక్తి ఏమి చెబుతున్నారో ఓపికగా అర్థం చేసుకోవడానికి మనస్సుతో ప్రయత్నించడం.
- మాట్లాడటం ముగించిన తర్వాత స్పష్టమైన ప్రశ్నలు , సలహాల కోసం మీ నోటిని ఉపయోగించడం.
- మాట్లాడే వ్యక్తి భావాలకు సానుభూతి తెలియజేయడానికి మీ హృదయాన్ని ఉపయోగించడం.
- చెబుతున్న వ్యక్తి మాటలపై ఆసక్తిని చూపించడానికి మీ కళ్ళు, ముఖ కవళికలను ఉపయోగించడం.
- మీ గ్రామంలో లేదా పరిసరాల్లో ఇష్టమైన వాటి గురించి సంభాషణలలో పాల్గొనడం
- కుటుంబం లేదా స్నేహితులతో ఈ వినే నైపుణ్యాలను అభ్యసించడానికి ఒక అద్భుతమైన మార్గం.

– **నలిన్ కుమార్ మిశ్రా**, కన్సల్టెంట్ – పిడబ్ల్యుసి



# హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, ప్రామాణిక ప్రశ్నాపత్రాల రూపకల్పనపై పరఖ్ వర్క్ షాప్ విజయవంతం

పాఠశాల విద్యా శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో పరఖ్ (PARAKH: Performance Assessment, Review, and Analysis of Knowledge for Holistic Development) ఆధ్వర్యంలో హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డు సెకండ్ స్టేజి (HPCs), ప్రామాణిక ప్రశ్నాపత్రాల నమూనాలు సిద్ధం చేయడానికి ఐదు రోజుల వర్క్ షాప్ ఫిబ్రవరి 25 నుండి మార్చి 1 వరకు విజయవాడలో జరిగింది. జాతీయ విద్యా విధానం (NEP-2020) మార్గదర్శకాలతో అనుసంధానంగా విద్యార్థి అంచనాలను మరింత ప్రతిభావంతంగా అమలు చేయడమే ఈ వర్క్ షాప్ ప్రధాన లక్ష్యం. ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్రంలోని 100 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. 5 రోజుల వర్క్ షాప్ లో ఉపాధ్యాయులకు నూతన మూల్యాంకన విధానాలపై అవగాహన కల్పించడంతోపాటు, భవిష్యత్తు బోర్డు పరీక్షల కోసం ప్రశ్నాపత్రాల రూపకల్పనలో నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా నిర్వహించారు.

### వర్క్ షాప్ ముఖ్యాంశాలు:

- హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులకు అనుగుణంగా మూల్యాంకన విధానాల రూపకల్పన
- రాష్ట్ర ప్రశ్నాపత్రాల విశ్లేషణ & డీకన్స్ట్రక్షన్
- ప్రశ్నాపత్రాల బ్లూప్రింట్ రూపకల్పన
- నైపుణ్య ఆధారిత ప్రశ్నలు రూపొందించేందుకు తగిన మార్గదర్శకాలు
- మోడల్ ప్రశ్నాపత్రాల రూపకల్పన

### భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే విద్యార్థులను సిద్ధం చేయాలి

భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే విద్యార్థులను సిద్ధం చేయడం ఉపాధ్యాయుల అందరి బాధ్యత. ప్రశ్నాపత్రాలు విద్యార్థుల్లో విశ్లేషణాత్మక ఆలోచన, సమస్యల పరిష్కార నైపుణ్యాలను పెంపొందించేలా ఉండాలి.

– **విజయ్ రామ రాజు వి**, I.A.S., పాఠశాల విద్య సంచాలకులు

### విద్యా వ్యవస్థ లో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

– **బి. శ్రీనివాసరావు**, I.A.S.,
సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు

NEP లక్ష్యాలకు అనుగుణంగా హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డుల అమలు విద్యా వ్యవస్థలో కీలకమైన సంస్కరణ. ఉపాధ్యాయులే విద్యా మార్పుకు కీలకమైన శక్తి.

### పరఖ్ సీఈఓ, ప్రొఫెసర్ ఇంద్రాణి బాధురి

న్యూఢిల్లీ లోని NCERT లో పరఖ్ సంస్థ సీఈఓ, హెడ్, ప్రొఫెసర్ ఇంద్రాణి బాధురి ఈ వర్క్ షాప్ లో ప్రశ్నపత్రాల నమూనాల ప్రామాణీకరణ అనే అంశంపై ఆన్ లైన్ ద్వారా పాల్గొని ప్రసంగించారు. ఈ వర్క్ షాప్ లో ఎన్సీఈఆర్టీ– పరఖ్ ప్రతినిధులు బిదీశా మజుందర్, చరణ్ సింగ్ లు శిక్షణ ఇచ్చారు. వర్క్ షాపులో సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి, APOSS డైరెక్టర్ ఆర్. నరసింహారావు, పరఖ్– ఎన్సీఈఆర్టీ ప్రతినిధులు, ప్రభుత్వ పరీక్షల విభాగ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

– **అమలాపురపు దుర్గాప్రసాద్**, జర్నలిస్ట్






స్కాన్ చేయండి.. ఫాలో అవ్వండి..
మన బడి మ్యాగజైన్ చదువుకోండి.

# రచనలకు ఆహ్వానం

**ఉపాధ్యాయులకు, విద్యార్థులకు,
రచయితలకు, తల్లిదండ్రులకు విజ్ఞప్తి...**

"పాఠశాల విద్యాశాఖ – సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో విద్యా, విషయక, విజ్ఞాన అంశాలతో వస్తున్న మాసపత్రిక **మన బడి** కోసం.. మీనుంచి రచనలను ఆహ్వానిస్తున్నాం. పిల్లలకు విజ్ఞానాన్ని, వినోదాన్ని అందించే రచనలు ఏవైనా, ఎవరైనా పంపవచ్చు. కథలు, వ్యాసాలు, కవితలు, గేయాలు, జోకులు, బొమ్మలు, కార్టూన్లు, అనువాద రచనలు, సృజనాత్మక బోధనా పద్ధతులు, విద్యార్థులు రూపొందించిన ఉత్తమ ప్రాజెక్టులు... ఇలా ఏ అంశాన్నయినా రాసి పంపండి. బాగున్నవాటిని ప్రచురిస్తాం. సొంత రచనలై ఉండాలి, ఎక్కడ ప్రచురితం కాకూడదు. మీ పేరు, ఫోన్ నంబరు, చిరునామా, హామీ పత్రం తప్పనిసరిగా జోడించండి. ఉత్తరప్రత్యుత్తరాలకు తావు లేదు. ఎంపిక కాని రచనలు తిరిగి పంపబడవు. ప్రచురితమైన వాటిలో ఉత్తమ రచనలకు చక్కని బహుమతి ఇవ్వబడును. ఈ రచనా యజ్ఞంలో పిల్లలు, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు ,రచయితలు భాగస్వాములవ్వాలని కోరుతున్నాం. ఇందులో రచయితల వెలిబుచ్చిన అభిప్రాయాలు పూర్తిగా వారి సొంతం. రచయితల అభిప్రాయాలతో సంపాదకులు, ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్షా ఏకీభవించాల్సిన పనిలేదు."



మీ రచనలు పంపాల్సిన చిరునామా:


**స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ & ఎడిటర్**

సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయం, కేబీసీ బాయ్స్ హైస్కూల్ కాంపౌండ్,
పటమట, విజయవాడ, ఎన్టీఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్, పిన్: 520 010,
వాట్సాప్ నంబర్: 87126 52298
manabadimagazine@gmail.com




# నైపుణ్యంతో కూడిన విద్యను అందించాలి

విద్యార్థుల్లో చదువుతో పాటు వృత్తి విద్యా నైపుణ్యాల పట్ల ఆసక్తిగా కనబరిచేలా ప్రోత్సహించాలని ఒకేషనల్ ట్రైనర్లను ఉద్దేశిస్తూ సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు *బి.శ్రీనివాసరావు IAS.* పిలుపునిచ్చారు.

మార్చి 2న విజయవాడలోని మేరిస్ స్టెల్లా కాలేజీలో జరిగిన వృత్తి విద్యా శిక్షకులకు (ఒకేషనల్ ట్రైనర్లకు) ఐదు రోజుల పాటు శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీడీ మాట్లాడుతూ..



సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో 9 నుండి 12 తరగతుల విద్యార్థులకు 10 ట్రేడుల్లో వృత్తి విద్యా కోర్సు అందిస్తున్నామని తెలిపారు. తొలి విడతలో భాగంగా ఐటీ విభాగానికి మేరి స్టెల్లా కాలేజీ (విజయవాడ)లో, అగ్రికల్చర్, ఫుడ్ ప్రోసెసింగ్, హెల్త్ కేర్, గృహోపకరణలు, దుస్తులు తయారీ వంటి విభాగాలకు సెయింట్ జోసెఫ్స్ కళాశాల (గుంటూరు)లో శిక్షణ ఇచ్చామన్నారు. శాస్త్రీయ దృక్పథంతో, విద్యార్థులకు ఆలోచన రేకెత్తించేలా, స్వశక్తిమీద జీవనాధారం పెంపొందించుకునేలా విద్యార్థులను తయారు చేయాలన్నారు. రెండో విడతలో **మార్చి 4 నుండి 7 వరకు** భాగంగా మిగిలిన ట్రేడులు బ్యూటీ అండ్ వెల్‌నెస్, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు , బీమా, రిటైల్, ఆటోమోటివ్, ఎలక్ట్రానిక్స్ & హార్డ్ వేర్ అంశాల్లోని ట్రైనర్లకు శిక్షణ ఇచ్చారు.



# 'వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్' 2025
## విజేతలకు బహుమతులు

పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, SCERT, విభా లీప్ ఫార్వర్డ్ భాగస్వామ్యంతో నిర్వహించిన 'వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్' పోటీ విజేతలకు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు శ్రీ బి.శ్రీనివాసరావు IAS., గారు బహుమతులు అందజేశారు. విజయవాడలోని బెర్మ్ పార్క్ లో 'వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ విజేతలకు' బహుమతి ప్రదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ జిల్లా పాడేరు డివిజన్‌లోని 11 మండలాలు, ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాలు, కృష్ణా, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలు నిలిచిన వారు ముంబైలో జరిగే ఇంటర్ స్టేట్ గ్రాండ్ ఫైనల్స్‌లో పాల్గొంటారు. కార్యక్రమంలో విభా సౌత్ ఇండియా మేనేజర్ T. వీరనారాయణ, లీప్ ఫార్వర్డ్ టీమ్ ప్రణిల్ నాయిక్, శ్వేత, విజయ్ కుమార్, సమగ్ర శిక్షా నుండి జి.అపర్ణ, డాక్టర్ శారద, శైలా కల్పన పాల్గొన్నారు.







కవర్ స్టోరి

# సమగ్ర విద్యకు పాతికేళ్లు

* 2001లో సర్వశిక్షా అభియాన్‌గా ప్రారంభం
* 2025లో సమగ్రశిక్షా పేరుతో ప్రయాణం
* నిర్బంధ ఉచిత విద్య అమలుకు ఆవిర్భావం
* సమగ్ర విద్యా వికాసం కోసం అలుపెరుగని ప్రస్థానం

## సమగ్ర విద్య ఆలోచనలు ఆచరణ రూపం దాల్చి పాతికేళ్లయ్యింది..

## పేరు, తీరు, లోగోలు మారాయి.. లక్ష్యాలు మరింత విస్తృతమయ్యాయి..

సమగ్ర విద్య కోసం కేంద్రం, రాష్ట్రప్రభుత్వాల సమన్వయంగా సాగుతున్న విద్యా ప్రస్థానం రెండున్నర దశాబ్దాలు దాటింది.. సర్వశిక్షా అభియాన్ అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తొచ్చేది.. పెన్సిల్ మీద ఒక వైపు బాలుడు, మరో వైపు బాలిక కూర్చొన్న చిహ్నం గుర్తొస్తుంది కదూ..! అదే ఇప్పుడు సమగ్రశిక్షా.

6-14సంవత్సరాలలోపు పిల్లలు అందరికీ విద్య'ను అందించాలనే లక్ష్యంతో 'సర్వశిక్షా అభియాన్'ను నాటి భారత ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి 2001లో ప్రారంభించారు. కాలక్రమేణా ఆ పథకం పొడిగించి సర్వ శిక్షా అభియాన్ (SSA), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA), టీచర్ ఎడ్యుకేషన్ (TE) అనే మూడు పూర్వపు పథకాల విలీనంతో ప్రస్తుతం 'సమగ్ర శిక్షా'గా ఆవిర్భవించి సమగ్ర విద్యాభివృద్ధికి కృషి చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి మూలమైన సర్వశిక్షా అభియాన్‌కు పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా సమగ్ర కథనం.

### తొలుత DPEP

1994లో భారత ప్రభుత్వ ప్రాథమిక విద్యా అభివృద్ధి కోసం జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం (DPEP) కేంద్ర ప్రాజెక్టుగా ఆమోదించబడింది. సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించే లక్ష్యంతో DPEP 2000లో ముగించి, తర్వాత 2001ల సర్వశిక్షా అభియాన్ (SSA) ప్రాజెక్టును ప్రారంభించారు.


### సర్వశిక్షా అభియాన్


6–14 సంవత్సరాల మధ్య వయస్సున్న బాలలందరికీ ఉచిత, నిర్బంధ విద్యను ఒక ప్రాథమిక హక్కుగా మార్చిన పథకం సర్వ శిక్షా అభియాన్. ఇది భారత రాజ్యాంగంలో 86వ సవరణ ద్వారా ప్రాథమిక విద్య అందరికీ అందించే లక్ష్యంతో నాటి ప్రధాని వాజ్‌పేయి ఆధ్వర్యంలో భారతదేశ ప్రభుత్వం చేపట్టిన ఒక ప్రతిష్ఠాత్మక కార్యక్రమం.

ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అవసరమైన చోట పాఠశాలలు స్థాపించడం, పిల్లలందరినీ పాఠశాలలలో చేర్పించడం, అందరికీ విద్యను అందించడం, నిరక్షరాస్యతను రూపుమాపి, అక్షరాస్యతను సాధించడం దిశగా కృషి చేసింది.

### ప్రాథమిక విద్య సార్వజనీకరణ కోసం రాజ్యాంగ, న్యాయ, జాతీయ ప్రకటనలు.. ఆవిర్భావ కారణాలు

* "ఈ రాజ్యాంగం అమలు చేసిన సమయం నుంచి పదేళ్ల కాలంలోగా దేశంనలోని బాలలందరికీ 14 ఏళ్ల వయస్సు వచ్చే వరకు ఉచితంగా, తప్పనిసరి విద్య అందించేందుకు ప్రయత్నించాలి." – రాజ్యాంగ ఆదేశం, 1950
* "మనం 20వ శతాబ్దంలోకి అడుగుపెట్టడానికి ముందు బాలలందరికీ 14 ఏళ్ల వయస్సు వరకు సంతృప్తికరమైన ఉచిత, నిర్బంధ విద్య అందేలా చూడాలి" – జాతీయ విద్యా విధానం, 1986





* "ఈ దేశం ప్రతి బిడ్డ/పౌరుడికి పద్నాలుగేళ్ల వయస్సు వచ్చే వరకు ఉచిత విద్య పొందే హక్కు ఉంది.'' – ఉన్నికృష్ణన్ తీర్పు, 1993

పై ప్రకటనల ఆధారంగా '2003 నాటికి బాలలందరూ బడి, విద్యా హామీ కేంద్రం లేదా ప్రత్యామ్నాయ పాఠశాలల్లో ఉండేలా చర్యలు, 2005 నాటికి ఐదేళ్ల ప్రాథమిక విద్యను, 2010 నాటికి బాలలు 8 ఏళ్ల పాఠశాల విద్యను పూర్తి చేయడం, 2007నాటికి ప్రాథమిక స్థాయిలోను, 2010నాటికి ప్రాథమిక విద్యా స్థాయిలోనూ లింగ, సామాజిక అంతరాలన్నింటినీ తొలగించడం, పాఠశాల విద్య సార్వత్రీకరణ' లక్ష్యంగా సర్వశిక్షా అభియాన్ పని చేసింది.

ఈ దిశగా లేని చోట కొత్త పాఠశాలలు ఏర్పాటు చేయడం, ఇప్పటికే ఉన్న పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీటి వసతులు, నిర్వహణ నిధులు, పాఠశాల అభివృద్ధి నిధుల కల్పన ద్వారా మౌలిక సదుపాయాలను పటిష్ఠపరచడం వంటి చర్యలు చేపట్టింది. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయుల నియామకం, విస్తృత శిక్షణ, బోధన-శిక్షణ సౌకర్యాలను అభివృద్ధి చేయడం కోసం నిధులు కేటాయించడం ద్వారా ఇప్పటికే ఉన్న ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం, ఒక సమూహం, బ్లాకు, జిల్లా స్థాయిల్లో విద్యా మద్దతు వ్యవస్థను పటిష్ఠపరచడం ఈ పథకంలో భాగమయ్యాయి. అందుకే 'సర్వశిక్షా అభియాన్'ని 'అందరికీ విద్య' ఉద్యమంగా పేర్కొనేవారు.

## రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA)

ఓ పైపు ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తూనే 2009లో దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మాధ్యమిక విద్య అభివృద్ధి కోసం భారత ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ కేంద్రంగా రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (RMSA) ప్రాయోజిత పథకాన్ని ప్రారంభించింది. అందరికీ సమర్థవంతమైన వృద్ధి, అభివృద్ధి , సమానత్వం కోసం ఈ పథకం అమలు 2009–2010 నుండి ప్రారంభమైంది.


2014 నాటికి మాధ్యమిక విద్య నాణ్యతను పెంచడం, 15 – 16 సంవత్సరాల మధ్య వయస్సు పిల్లలందరికీ సార్వత్రిక విద్యను అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. 'లింగ, సామాజిక – ఆర్థిక, వైకల్య అడ్డంకులను తొలగిస్తూ 2017 నాటికి, అంటే XII పంచవర్ష ప్రణాళిక చివరి నాటికి సార్వత్రిక మాధ్యమిక స్థాయి విద్య అందుబాటులోకి తీసుకురావడం' దిశగా ఎనలేని కృషి చేసింది.





### ఇందులో భాగంగా

* పర్యావరణ విద్య, సైన్స్, గణితం, కంప్యూటర్ అక్షరాస్యతపై అధిక ప్రాధాన్యతనిచ్చింది.
* ప్రత్యేక అవసరాల పిల్లల కోసం (CWSN) ఉచిత విద్యతో పాటు ఆర్థిక ప్రోత్సాహకాలు అందించింది.
* అంతర్జాతీయ గణితం , సైన్స్ ఒలింపియాడ్‌లు ప్రచారం ఊపందుకుంది...
* రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధ్యాయులకు ఇన్-సర్వీస్ శిక్షణను అందించాయి.
* ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీస్ (ICT):
* పాఠశాలల్లో కంప్యూటర్ విద్య అందించింది.
* షెడ్యూల్డ్ తెగ, షెడ్యూల్డ్ కుల సమూహాలు, మైనారిటీ బాలికలు, CWSN పిల్లలు వంటి ప్రత్యేక వర్గాలకు మాధ్యమిక విద్యను అందించడంపై RMSA ప్రాధాన్యత ఇస్తూ మాధ్యమిక విద్య స్థాయిలో సామాజిక-ఆర్థిక, లింగ నేపథ్యంలో ఉన్న అసమానతలను తొలగించడంపై విశేష కృషి చేసింది.
* దివ్యాంగ విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్ (IEDC) సమ్మిళిత విద్యను ప్రవేశపెట్టింది.





## టీచర్ ఎడ్యుకేషన్ (TE)

భారతదేశంలో ఉపాధ్యాయ విద్యను మెరుగుపరచాలనే లక్ష్యంతో CSSTE (Centrally Sponsored Scheme of Teacher Education) 1987లో ప్రారంభించారు. తరువాత దీనిని 2018లో సమగ్ర శిక్షాలో విలీనం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర విద్యా పరిశోధన , శిక్షణ మండలి (SCERTs) లను బలోపేతం చేయడం, ఏటా పెద్ద సంఖ్యలో పాఠశాల ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేయడం, ICT పై ఉపాధ్యాయులకు శిక్షణ వంటి కార్యక్రమాలు మొదలుపెట్టారు.

## సమగ్రశిక్షా లక్ష్యాలు ఇవీ

విద్యాభివృద్ధే లక్ష్యంగా ప్రీ-నర్సరీ నుండి 12వ తరగతి వరకు విభజన లేకుండా పాఠశాల విద్యను సమగ్రంగా అందించడానికి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టు సమగ్ర శిక్షా.

* విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం
* అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం
* పాఠశాల విద్యలో సామాజిక, లింగ అంతరాలను తగ్గించడం
* పాఠశాల విద్యలో అన్ని స్థాయిలలో సమానత్వం
* పాఠశాల నిబంధనలలో కనీస ప్రమాణాలను నిర్ధారించడం
* వృత్తి విద్యను ప్రోత్సహించడం
* బాలల ఉచిత , నిర్బంధ విద్యా హక్కు (RTE) చట్టం, 2009 అమలులో రాష్ట్రాలకు మద్దతు ఇవ్వడం
* అన్ని రాష్ట్రాల్లో ఒకేలా పథకం అమలు చేయడానికి రాష్ట్ర/ UT స్థాయిలో జాతీయ స్థాయిలో, విద్యా మంత్రి అధ్యక్షతన ఒక పాలక మండలి, పాఠశాల విద్య , అక్షరాస్యత శాఖ కార్యదర్శి అధ్యక్షతన ఒక పథక ఆమోద మండలి (Project Approval Board) ఉంటాయి.
* సమగ్ర శిక్షా ప్రధానంగా 2'T'ల టీచర్ &టెక్నాలజీపై దృష్టి సారించింది. తద్వారా పాఠశాల విద్య నాణ్యతను, అన్ని స్థాయిలలో అభ్యాస ఫలితాలను మెరుగుపరచడం కోసం పనిచేస్తోంది.
* ఉపాధ్యాయులు, పాఠశాల నాయకత్వ సామర్థ్య నిర్మాణాన్ని మెరుగుపరచడం.
* వ్యవస్థలో కాబోయే ఉపాధ్యాయుల నాణ్యతను మెరుగు పరచడానికి SCERTలు, DI-ETల వంటి ఉపాధ్యాయ విద్యా సంస్థలను బలోపేతం చేయడంపై దృష్టి.
* ఇన్-సర్వీస్, ప్రీ-సర్వీస్ ఉపాధ్యాయ శిక్షణ కోసం SCERT నోడల్ సంస్థగా ఉంటుంది
* పాఠశాలల్లో సైన్స్, గణిత అభ్యాసాన్ని ప్రోత్సహించడానికి రాష్ట్రీయ ఆవిష్కార్ అభియాన్‌కు మద్దతు.
* ప్రాథమిక స్థాయిలో పునాది నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి పఢే భారత్ బఢే భారత్ కార్యక్రమానికి మద్దతు.
* ప్రతి పాఠశాలకు రూ. 5000 నుండి రూ. 20000 వరకు లైబ్రరీ గ్రాంట్ల నిబంధన.

## డిజిటల్ విద్యపై దృష్టి

* స్మార్ట్ తరగతి గదులు, డిజిటల్ బోర్డులు, DTH ఛానెల్‌ల ద్వారా విద్యలో డిజిటల్ సాంకేతికతను మెరుగుపరచడం.
* UDISE+, షగున్ వంటి డిజిటల్ కార్యక్రమాలను బలోపేతం చేయడం.
* ఉన్నత ప్రాథమిక నుండి ఉన్నత మాధ్యమిక స్థాయి వరకు పాఠశాలల్లో ICT మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం.

## పాఠశాలల బలోపేతం

* 1 నుండి 8 తరగతుల పిల్లలకు రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం.
* సమ్మిళిత పాఠశాల గ్రాంట్ రూ. 14,500-50,000 నుండి రూ. 25,000- 1 లక్షకు పెంచబడింది. పాఠశాల నమోదు ఆధారంగా కేటాయించబడుతుంది.
* స్వచ్ఛత కార్యకలాపాలకు నిర్దిష్ట నిబంధన - 'స్వచ్ఛ విద్యాలయ'కు మద్దతు.
* ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల నాణ్యతను మెరుగుపరచడం.

## బాలికా విద్యపై దృష్టి

★ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల (KGBVలు) 6-8 తరగతుల నుండి 6-12 తరగతులకు అప్‌గ్రేడ్ చేయడం.

★ ప్రాథమికోన్నత స్థాయి నుండి సీనియర్ సెకండరీ స్థాయి వరకు బాలికలకు స్వీయ-రక్షణ శిక్షణ అందిస్తున్నాయి.

★ 'బేటీ బచావో - బేటీ పఢావో' నినాదాన్ని పటిష్టంగా అమలు చేయడం.









## అందరి సహకారంతో లక్ష్య సాధన దిశగా..

విద్యార్థుల నమోదు, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు , శారీరక విద్యపై దృష్టి సారించిన ఆంధ్రప్రదేశ్ 'సమగ్ర శిక్షా' క్రీడా విద్యను పాఠ్యాంశాలలో అంతర్భాగంగా చేయడంలో విశేషమైన కార్యాచరణ అమలు చేస్తోంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు, పాఠశాల విద్యాశాఖ, ఇతర ప్రభుత్వ విభాగాల సహకారంతో లక్ష్యసాధనకు ఎనలేని కృషి చేస్తోంది. విద్యాపరంగా వెనుకబడిన బ్లాక్‌లు , వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాలు, సరిహద్దు ప్రాంతాలు , నీతి ఆయోగ్ గుర్తించిన జిల్లాల్లో వేగవంతమైన విద్యాభివృద్ధికి సమగ్ర శిక్షా పనిచేస్తోంది.

### గ్రంథాలయాలకు పూర్వవైభవం

రాష్ట్రంలో 44,998ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాలకు CIIL, NBT, Publication Divisionలకు చెందిన రూ. 3351.93 లక్షలు విలువైన 79లక్షల పుస్తకాలు పంపిణీ సమగ్రశిక్షా ద్వారా చేశారు.

### Centre of Excellenceగా డైట్ కళాశాలలు

కేంద్ర పాఠశాల విద్య &అక్షరాస్యత శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యా, శిక్షణ సంస్థలు (DIETs)ను Centre of Excellence గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించడమైనది. ఈ కేంద్రాలు ఉపాధ్యాయుల ప్రీ-సర్వీస్, ఇన్-సర్వీస్ శిక్షణా కార్యక్రమాలకు అనుగుణంగా పనిచేస్తాయి.

### లెర్నింగ్ ఇంప్రూవ్ మెంట్ ప్రోగ్రామ్ (LIP)

అన్ని యాజమాన్య పాఠశాలల్లో 6 నుండి 9వ తరగతులు చదువుతున్న ప్రాథమికోన్నత, మాధ్యమిక విద్యార్థుల అభ్యాసాన్ని మెరుగుపరచడంకోసం LIPకార్యక్రమం నిర్వహించబడుతుంది.

### టీచింగ్ ఎట్ రైట్ లెవల్ (TaRL) -2015-2024

ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్య కమిషనరేట్ సంయుక్తంగా సమగ్ర శిక్ష (SSA) సహకారంతో "బిల్డ్ బ్యాక్ బెట్టర్" ప్రోగ్రామ్ అమలు చేస్తున్నారు. ఇది ప్రథమ్ సంస్థ అభివృద్ధి చేసిన "Teaching at the Right Level (TaRL)" ఆధారిత అభ్యాస పద్ధతిపై 32,963 పాఠశాలల్లో అమలవుతోంది.

### టీచ్ టూల్

★ తరగతి బోధనగుణాత్మకతను పెంపొందించడం, విద్యార్థుల నిమగ్నతను (student engagement) మెరుగుపరచడం లక్ష్యంగా "క్లాస్‌రూమ్ అబ్జర్వేషన్ ప్రోగ్రామ్" రూపుదిద్దుకుంది.

### (Personalized Adaptive Learning - PAL)

★ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో PAL (Personalized Adaptive Learning) విధానాన్ని స్వీకరించింది. దీని ద్వారా 6-9 తరగతుల గణిత అభ్యాసాన్ని మెరుగుపరిచేందుకు ICT ల్యాబ్‌లను ఉపయోగించడం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యాప్తంగ17 జిల్లాల్లో 564 పాఠశాలల్లో ఈ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు.

### మాతృభాష ఆధారిత బహుభాషా విద్యా కార్యక్రమం (MTBMLE)

రాష్ట్రంలోని 11 గిరిజన జిల్లాల్లో మాతృభాష ఆధారిత బహుభాషా విద్యా కార్యక్రమం అమలు చేయబడుతోంది.

### ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ

ఆంధ్రప్రదేశ్ సమగ్రశిక్షా పిల్లలలో ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ (FLN) స్కిల్స్ మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తోంది.

### మోడల్ ఫౌండేషన్ పాఠశాల శిక్షణలు

పాఠశాల విద్యా శాఖ (DoSE), మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (WD & CW) సంయుక్త భాగసామ్యంతో అంగన్‌వాడీ కార్యకర్తలు (AWWs)కు, ఎర్లీ గ్రేడ్ టీచర్స్ (EGTs) శిక్షణ ఇవ్వడమైనది.

### సైన్స్ సెంటర్లు స్థాపన

ఏలూరు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, కడప జిల్లాల్లో ఐదు సైన్స్ సెంటర్లు స్థాపించారు.



## STEM ప్రయోగశాల భవిష్యత్తు ప్రాధాన్యత (LAB to ENTERPRENEUR)

STEM ప్రయోగశాలలు విద్యార్థులకు సృజనాత్మక ఆలోచనల ద్వారా పరిశోధన, ఆవిష్కరణ, ప్రాజెక్ట్ అభివృద్ధి అవకాశాలు కల్పిస్తాయి.

## Dhiksha

SCERT సూచన మేరకు, DIKSHA ప్లాట్‌ఫామ్‌లో 2022-23 కాలంలో 189 కొత్త ఎనర్జైజ్డ్ టెక్స్ట్ బుక్స్ (ETB) రూపొందించింది.

## సోషల్ ఆడిట్

పాఠశాలల్లో కార్యక్రమాలు, పథకాల అమలు పారదర్శకంగా జరుగుతున్నాయో లేదో తెలుసుకునేందుకు 'సోషల్ ఆడిట్' ఉపయోగపడుతుంది.

## రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్: స్వీయరక్షణ

కౌమార దశ బాలికలకు స్వీయరక్షణ కోసం పాఠశాలల్లో ఆత్మరక్షణ విద్య శిక్షణ ఇచ్చి అనుకోని దాడుల నుండి తమను తాము రక్షించుకునే సామర్థ్యాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం లక్ష్యం.

## సహిత విద్య (ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్)

ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఏప్రిల్ 2025 నాటికి పాఠశాలలన్నింటిలో సహిత విద్యను అందించే లక్ష్యంతో ఉంది. రాష్ట్రంలో 672 భవితా కేంద్రాలు ఉండగా 125 మండలాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు ఏర్పాటు చేయనున్నారు.

## PM SHRI

భారత ప్రభుత్వం ఎంపికచేసిన ప్రభుత్వ పాఠశాలలను ప్రధాన్ మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (PM SHRI) పాఠశాలలుగా అభివృద్ధి చేయనున్నారు.

## SIEMAT

సీ మ్యాట్ (SIEMAT)ఆధ్వర్యంలో ప్రస్తుత విద్యాభ్యాసానికి అనుకూలంగా పాఠ్యప్రణాళిక సిద్ధం చేసి, పాఠశాలల్లో అమలు చేస్తారు.

## SALT

వరల్డ్ బ్యాంక్ మద్దతుతో Supporting Andhra Learning Transformation (SALT) ప్రోగ్రాం ప్రారంభించబడింది. విద్యా, బోధన, నిర్వహణ నాణ్యత నైపుణ్యాలను శిక్షణ ద్వారా పెంపొందించడం సాల్ట్ ప్రాజెక్టు లక్ష్యం.

## బాలికా విద్యకు కేజీబీవీలు:

రాష్ట్రంలో 352 కేజీబీవీలు ఉన్నాయి. 6-12 తరగతుల బాలికలకు చక్కని వసతి, రుచికరమైన పౌష్టికాహారంతో పాటు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. వీటిల్లో అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు) పేద, ఎస్.సి, ఎస్.టి, బిసి, మైనారిటీ, దారిద్ర్య రేఖకు దిగువన వున్న కుటుంబాల బాలికలు చదువుతున్నారు.

## కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిర్లు నియామకం

విద్యార్థులకు మానసిక ఒత్తిడి వంటి వాటిని అధిగమించడానికి 255 పాఠశాలల్లో కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ లను నియమించారు.

విద్యా ప్రవేశ్, 'బడి బయట పిల్లలు' లేకుండా, పాఠశాల నాయకత్వం (స్కూల్ లీడర్ షిప్) శిక్షణలతో సమగ్రశిక్షా విద్యావికాసానికి ప్రణాళికాబద్ధంగా పనిచేస్తోంది.

– **గణేశ్ బెహరా,** పీఆర్వో, సమగ్ర శిక్షా
7732097027





యాత్రానుభూతి

# కల నిజమైన వేళ.. విశాఖ అందాలు చూసాం ఇలా...

మేము ఎస్. నిహారిక, వి. పూజిత.పార్వతీపురం మన్యం జిల్లా, భామిని ఏపి మోడల్ స్కూల్ లో 9వ తరగతి చదువుతున్నాం. మా జీవితానికి మార్గదర్శకంగా నిలిచిన అద్భుతమైన సైన్స్ టూర్ అనుభవాన్ని మీతో పంచుకోవడం మా అదృష్టంగా భావిస్తున్నాం. మా సామాన్యమైన జీవితంలో ఇలాంటి ప్రయాణాలు సాధ్యపడవు. అయితే, జిల్లా స్థాయిలో మా సైన్స్ ప్రాజెక్టులు ఎంపిక కావడం వల్ల 'విశాఖపట్నం' చూసే అద్భుత అవకాశాన్ని పొందగలిగాము. మా యాత్రానుభూతి మీతో పంచుకుంటున్నాం.

మార్చి 10, 2025 ఉదయం, మా టూర్ ఉత్సాహం, ఆసక్తితో మొదలైంది. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ గారి చేతుల మీదుగా బస్సును ప్రారంభించగా, ఎంతో ఆనందంగా బస్సులో బయలుదేరాం. ముందుగా మేము విశాఖపట్నంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి, సాంకేతిక విద్య, శాస్త్రీయ అభివృద్ధి గురించి తెలుసుకున్నాం. ఆ తర్వాత గీతం విశ్వవిద్యాలయాన్ని సందర్శించాం. ఇది మాకు ఉన్నత విద్యపై విశాల దృష్టిని కలిగించింది. అందులో అద్భుత అనుభవం "INS కుర్సురా సబ్‌మెరైన్ మ్యూజియం", "TU 142" విమాన మ్యూజియాలను సందర్శించాము.

## ఎంత పెద్ద సబ్ మెరైనో...

INS కుర్సురా సబ్‌మెరైన్ సందర్శన మాకు మర్చిపోలేని అనుభవాన్ని అందించింది. ఆ నిర్మాణం ఎంతో ఆసక్తికరంగా అనిపించింది. కంట్రోల్ ప్యానెల్స్, టార్పెడో లాంచింగ్ వ్యవస్థలు, సిబ్బంది వసతి గదులు చూశాము. సముద్ర గర్భంలో నిరంతరం సేవలు అందిస్తున్న నావికాదళ అధికారుల త్యాగాలను అర్థం చేసుకోవడానికి ఇది మంచి అవకాశంగా మారింది. TU 142 విమాన మ్యూజియాన్ని సందర్శించాము. రాడార్ వ్యవస్థలు, కమ్యూనికేషన్‌పరికరాలు, పైలట్ కాక్‌పిట్ వంటి ఎన్నో అంశాలను మేము చూసాము. ఈ విమానం గతంలో దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిందని తెలుసుకొని ఎంతో గర్వంగా అనిపించింది.



## ఆ అనుభూతే వేరయా

ఈ టూర్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులతో కలిసి ప్రయాణించడం, కొత్త స్నేహితులతో పరిచయం ఎంతో ఆనందాన్నిచ్చింది. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన మేము ఇలాంటి అనుభవం పొందడం ఒక గొప్ప అవకాశం. ఈ టూర్‌ను నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వి. విజయ్ రామరాజు, IAS, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, బి. శ్రీనివాసరావు IAS, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్షా, జిల్లా కలెక్టర్ పార్వతీపురం మన్యం శ్యామ్ ప్రసాద్, IAS, తిరుపతి నాయుడు, DEO, R తేజేశ్వరరావు APC సమగ్ర శిక్షా, లక్ష్మణ్ DSO, మా ప్రిన్సిపాల్ శివకుమార్, సైన్సు ఉపాధ్యాయులకు మా ప్రత్యేక కృతజ్ఞతలు.

## సేవ చేయాలనే ఉత్సాహమొచ్చింది

ఈ టూర్ మాలో శాస్త్రం పట్ల మక్కువను, దేశ సేవకు నూతన సంకల్పాన్ని కలిగించింది. మన సైనికుల ధైర్యం, దేశ రక్షణలో శాస్త్ర సాంకేతికత ప్రాముఖ్యతను ప్రత్యక్షంగా చూశాం. ఈ అనుభవం మాలో ఎన్నో మార్పులను తీసుకొచ్చింది. మేము దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో మరింత కృషి చేసి, శాస్త్ర పరిశోధన, రక్షణ సాంకేతికత లేదా ఇతర రంగాల్లో సేవ చేయాలనే ఉత్సాహాన్ని కలిగించింది. ఈ అద్భుత అనుభవం మాకు ఎప్పటికీ గుర్తుంటుంది. మాతో పాటు ఎంతోమంది పిల్లలు ఇలాంటి అవకాశాలను పొందాలని, తెలుసుకోవాలని మేము ఆశిస్తున్నాము.





**– ఎస్. నిహారిక & వి. పూజిత,**
9వ తరగతి, ఏపి మోడల్ స్కూల్ భామిని,
భామిని మండలం, పార్వతీపురం మన్యం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.

*"2024 – 25 విద్యా సంవత్సరానికిగాను రాష్ట్ర సమగ్ర శిక్ష దాదాపు 15 వేల మంది ఎలిమెంటరీ, సెకండరీ విద్యార్థులకు విజ్ఞాన విహారయాత్రలకు అంతరాష్ట్ర, రాష్ట్రేతర విజ్ఞాన విహార యాత్రలకు దాదాపు 2.40 లక్షల రూపాయల నిధులను వివిధ జిల్లాలకు విడుదల చేసింది. గత కొద్ది సంవత్సరాలుగా ఇటువంటి విజ్ఞాన విహారయాత్రలు విద్యా వ్యవస్థలో జరగలేదు, ఈ సంవత్సరం ఎంతోమంది విద్యార్థులకు సదావకాశాన్ని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు గారి చొరవతోఅవకాశం దక్కింది.*



**– కల్పన శైలా,** ప్రోగ్రామ్ ట్రైనింగ్ ఆఫీసర్, సమగ్ర శిక్షా.

# బొమ్మ గీశానోచ్!



కె.లక్ష్మీకాంత్, పదో తరగతి, ZPHS ముద్దిరెడ్డిపల్లి, హిందూపూర్ (మం) శ్రీ సత్యసాయి జిల్లా



కె.నాయక్, 5వ తరగతి, MPP స్కూల్ కొత్తూరు (క్రైకరం) పశ్చిమ గోదావరి





ఎం. వసంత కృష్ణ వేణి, 9వ తరగతి, కేజీబీవీ ఆనందపురం, విశాఖపట్నం.



జి.సారిక, 4వ తరగతి, MPPPS (GVG) రామేశ్వరం, సకినేటిపల్లి మండలం, డా. బీఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

## రంగులు వేయండి



## చుక్కలు కలపండి



# అబ్బబ్బో సిత్రాలు... (గేయం)

అబ్బబ్బో చిత్రాలు
ఆరోగ్య సూత్రాలు
ఆహార శుభ్రత
భద్రత మార్గాలు
ఆచరించే తీరు
చూసిన చాలు
అగుపించు ఎన్నో
అవలక్షణాలు
ఇంటా నాన్ స్టిక్కు వంటా,
బయటా ప్లాస్టిక్కు పెంటా... బతుకు ॥ అబ్బబ్బో ॥

శుభ్రత ,శుచులు –
ఇంపైన రుచులు ,
సొంపైన ప్యాకింగ్లో
బర్గర్లు, పిజ్జాలు
ఆరగించే వాళ్ళు హాయిగ తూలు
కణాల్లోన నీకు పెరుగును కుళ్ళు 1 ॥ అబ్బబ్బో ॥

తినే తిళ్ళు దాచే
తీరు తెన్నులు
ప్యాకింగులన్నీ
పాలిథిన్నులు
పిండి వస్తువుతో పెరిగెను దేహం
బయట చెత్తతో బతుకులు హీనం 2 ॥ అబ్బబ్బో॥

పట్టు బట్టి పప్పు –

పొట్టు తీస్తున్నావు
పీచు పొట్టకంటే
పొట్టు పొల్లన్నావు
తిండి గింజలను గుళ్ళు చేశావు
ఒళ్ళు కాస్త నువ్వు గుల్ల చేశావు 3 ॥ అబ్బబ్బో ॥

ప్లాస్టిక్ తిన్న(తిన్నాయి )
పల్లెల్లో గోవులు
సింథటిక్కు పార్లే
పైరు భూములూ
పాడి పశువుకు పాడె కడుతున్నావు
భూములన్నిటినీ బీడు చేస్తున్నావు 4 ॥ అబ్బబ్బో ॥

మురుగు పారే చోట
చెత్త గుట్టలై
దారి తెన్నులేక
ముంచే వరదలై
నదులంటే ఎరుగని బస్తీలు
వరదతో చేసాయి కుస్తీలు 5 ॥ అబ్బబ్బో ॥

జంకు పుడ్డుకూ
జంకవు నువ్వు
ప్లాస్టిక్కుతో దాని
లింకులు పోవూ
ఒకటికి ఒకటీ జతపడ్డాయి
బతుకులతో తలపడ్డాయి . 6 ॥ అబ్బబ్బో ॥

చేతి సంచి అంటే
సిగ్గు సిగ్గన్నావు
క్యారీ బ్యాగు అంటే
మహా మోజన్నావు
నీలో పెరిగే భేషజాలు
నాటినాయి విషబీజాలు 7 ॥ అబ్బబ్బో ॥

భేషజాలకు
పోనేపోకు
తిండితో ప్లాస్టిక్కు
కలుపుకోకు
స్వస్థత వైపు దృష్టి సారించు
మిగిలిన వారిని కాస్త వారించు
ఆహారాన్ని మంచిగా ఉంచు
ఆరోగ్యాన్ని మందిలో పెంచు.



– బల్లా విజయ కుమార్,
సినీ గేయ రచయిత, విశాఖపట్నం
85006 41944











# బిడ్డ 'సెల్'లో ఉన్నాడు

కనిపెంచిన అమ్మయినా
కన్న తండ్రైనా
మాటల్లేవ్ మాట్లాడుకోడాల్లేవ్
ఓన్లీ వాట్సాప్

ఫీలింగ్స్ అయినా
షేరింగ్స్ కానీ
చావైనా పుట్టుకైనా
ఓన్లీ టైమ్ లైన్

మా ఇంటి మహా రాజు
మాయమయ్యాడు
వంట గది రారాజు
ఆ దిక్కే మరిచాడు

నా కోసం ఏం వండావమ్మా
అని అడగడమే మానేశాడు
పిజ్జా హట్ లో స్పూన్ ముద్దలు
కే ఎఫ్ సీ లో ఫోర్క్ తో కుస్తీలు

అమ్మ అని పిలిపించుకుని
ఎన్ని రోజులైంది
టచ్ స్క్రీన్ చేతికిచ్చి
మాతృ స్పర్శకు దూరమయ్యాడు

బాబూ ...మాటాడు ...
మాటలు ఖర్చు అయిపోతున్నాయి
మొబైలులో బాలెన్సు లేదమ్మా
ఫ్రీ టాక్ టైమ్ ఎప్పుడొస్తుందో ?

బిడ్డ సెల్ లో ఉన్నాడు
బెయిల్ రాని జైలులో
జీవిత ఖైదీ
క్షమాభిక్ష ఎప్పుడో ?

చార్జింగ్ తోనే నాలుకకు సిగ్నల్
మెమరీ కార్డుంటే అమ్మ వాల్ పేపర్
అప్పుడప్పుడూ స్క్రీన్ పై
వచ్చి పోతుంది

ఇప్పుడు మా చాలా విలువైనవి
కొనుక్కున్న మాటలు
అమ్ముకోవడానికే
ప్రీ పెయిడ్ గానో.. పోస్ట్ పెయిడ్ తోనో

మానవ సంబంధాలకు
సెకన్ల బిల్లింగ్ ..నిమిషాల ఆఫర్
నైట్ బేలన్స్.. అన్ లిమిటెడ్ టాక్ టైం
లైఫ్ టైం వ్యాలిడిటీ ...

మనసుకు మాటలు రావు
మనిషితో మాటాడాలంటే
ఏదో ఒక నెట్ వర్క్ లో ఉండాలి
ఏ ప్యాకేజీలో ఉన్నావో చెప్పాలి

ఒక్కోసారి లైన్లన్నీ బిజీ..
మరోసారి కాల్ వెయిటింగ్
స్విచాఫ్ .. లేదా ఔటాఫ్ కవరేజీ
మీరు డయల్ చేసిన నంబర్ ఒక సారి సరి
చూసుకోండి

– శ్రీచమన్
9490638222

# పిల్లలతో కథలు రాయించడం ఎలా?



కథలు తెలియని వాళ్ళు ఉండరు. కథ మనల్ని ఒక ఊహా ప్రపంచం వైపుకు తీసుకెళ్తుంది. కొత్త ఆలోచనలు రేకెత్తిస్తుంది. సమస్యకు సమాధానం అవుతుంది. సృజనను పెంపొందిస్తుంది. నిర్మాణాత్మక సామర్థ్యాన్ని పెంపొందిస్తుంది...

మరి ఇంతటి ఉపయోగకరమైన కథల్ని పిల్లలచే రాయిస్తే.... వాళ్ళు మన మధురమైన తెలుగు భాషను మరో తరానికి తరలింపచేస్తారు.... మరెందుకు ఆలస్యం కథ రాయడంలో మెళుకువలు తెలుసుకుందాం? సెలవుల్లో పిల్లలతో రాయించే ప్రయత్నం చేద్దాం.

### కథ రాయడానికి ప్రోత్సహించే మార్గాలు:

* ప్రశ్నలతో ప్రారంభించండి:
* "ఒక అడవిలో ఒక జంతువు ఒంటరిగా ఉంటే ఏమవుతుంది?"
* "ఒక వింతైన వస్తువు దొరికితే ఏం చేస్తావు?"
* "నీకు ఒక సూపర్ పవర్ వస్తే ఏం చేస్తావు?"
* "మన పాఠశాల లో మెగా టీచర్ పేరెంట్స్ డే జరగకపోతే ఎలా ఉంటుంది?
* జరిగితే ఎలా ఉంటుంది?
* ఇలాంటి ప్రశ్నలు పిల్లల్లో ఆలోచనలు రేకెత్తింప చేస్తాయి.
* చిత్రాలు చూపించాలి
* వివిధ చిత్రాలను చూపించి, వాటి గురించి కథలు అల్లమని చెప్పాలి.
* ఒక చిత్రం చూపి, దాని గురించి కథ రాయమని అడగాలి.
* కథా ప్రారంభాలు ఇస్తే బాగుంటుంది.
* "ఒకరోజు ఉదయం, నేను ఒక వింత శబ్దం విన్నాను..."
* "ఒక అడవిలో ఒక చిన్న కుందేలు..."
* "ఒక రాజు, ఒక రాణి..."
* స్నేహితులతో కలిసి రాయడం:
* పిల్లలను జంటలుగా లేదా చిన్న సమూహాలుగా చేసి, కలిసి కథలు రాయమని చెప్పాలి.
* ప్రోత్సహించడం గొప్ప ఫలితాలు ఇస్తుంది.
* వారి కథలను మెచ్చుకోండి.
* వారి ఊహలను ప్రోత్సహించండి.
* తప్పులను సరిదిద్దడానికి సహాయం చేయండి.
* పిల్లల తప్పులను సున్నితంగా సరి చేయాలి. చాలా బాగా రాశావు అని మెచ్చుకుంటూనే....... పిల్లల తప్పుల్ని సవరించాలి.

### కథ ఎలా రాయాలి?

★ ప్రారంభం:

* కథలోని పాత్రలను, స్థలాన్ని పరిచయం చేయండి.
* కథలోని సమస్యను లేదా సంఘటనను చెప్పండి.

★ మధ్యభాగం:

* పాత్రలు సమస్యను ఎలా పరిష్కరించడానికి ప్రయత్నిస్తాయో వివరించండి.
* ఆసక్తికరమైన సంభాషణలు జోడించండి.
* ఊహకు తగ్గట్టుగా కథను కొనసాగించండి.

★ ముగింపు:

* సమస్య ఎలా పరిష్కరించబడిందో చెప్పండి.
* కథ నీతిని చెప్పండి.

### నేర్చుకునే విధానం:

★ చదవడం:

* పిల్లలకు ఎక్కువ కథలు చదివి వినిపించండి.
* వారికి నచ్చిన కథలను చదవడానికి ప్రోత్సహించండి.

★ రాయడం:

* పిల్లలను ప్రతిరోజూ రాయడానికి ప్రోత్సహించండి.
* వారికి నచ్చిన విషయాల గురించి రాయమని చెప్పండి.

★ సృజనాత్మకత:

* వారి ఊహలను స్వేచ్ఛగా వదలండి.
* వారి కొత్త ఆలోచనలను ప్రోత్సహించండి.

### చిన్న పదాలతో కథ:

ఒక ఊరిలో రాజు వున్నాడు. రాజుకు ఒక తోట ఉంది. తోటలో ఒక పక్షి ఉంది. పక్షి పాటలు పాడుతుంది. రాజు పాటలు వింటాడు. ఒకరోజు, పక్షి పోయింది. రాజు బాధపడ్డాడు. ఒక పిల్లవాడు పక్షిని తెచ్చాడు. రాజు సంతోషించాడు.

కథ లో ఏమేమి జరిగాయి? అని మళ్ళీ చర్చ జరపచ్చు.

### ఆసక్తికరమైన సంభాషణలు:

* "నువ్వు ఎక్కడికి వెళ్ళావు?" రాజు అడిగాడు.
* "నేను అడవికి వెళ్ళాను," పక్షి చెప్పింది.
* "అడవిలో ఏం చూశావు?" రాజు అడిగాడు.
* "నేను చాలా జంతువులను చూశాను," పక్షి చెప్పింది.
* సినిమా తరహాలో కూడా ఆలోచింప చేయ వచ్చు.
* సృజనాత్మకత: పిల్లల ఊహలను ప్రోత్సహించడం, కొత్త ఆలోచనలు ప్రయత్నించడం వలన వారి సృజనాత్మకత పెరుగుతుంది.

పిల్లలు కథలు రాయడం ద్వారా వారి ఆలోచనలు, భావాలు స్పష్టంగా వ్యక్తమవుతాయి. వారి సృజనాత్మకతను ప్రోత్సహించడం ద్వారా వారి భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దవచ్చు.

నేను నా పాఠశాల పిల్లలతో కథలు రాయిస్తున్నాను. మీరూ రాయించండి!

– **ఉమ్మడి వెంకట రమణ**, సెకండరీ గ్రేడ్ టీచర్,
ములకల చెరువు మండలం, అన్నమయ్య జిల్లా.
vummadilakshmiramana@gmail.com




# ఉపాధ్యాయులకు అబ్రహం లింకన్ రాసిన అద్భుత లేఖ

ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఒక అద్భుతమైన లేఖ ఇది. తన కుమారుణ్ణి స్కూల్లో చేర్చుతూ ఒకనాటి అమెరికన్ ప్రెసిడెంట్ అబ్రహం లింకన్ టీచర్ కి రాసిన లేఖ. ఇది ప్రతి తల్లికి, తండ్రికి, టీచర్ కు, విద్యార్థికి చేరాల్సిన లేఖ. ప్రముఖ అనువాదకురాలు శాంత సుందరి ఈ లేఖను తెలుగులోకి అనువదించి మనకు అందించారు.

"మా అబ్బాయి ఇవాళే మొదటిసారి స్కూలుకి వస్తున్నాడు. కొంతకాలం అక్కడ అంతా వాడికి వింత గానూ కొత్తగానూ ఉండబోతోంది. అందుకే వాడితో మీరు కొంచెం సున్నితంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాను. ఈ సాహసకృత్యం వాణ్ణి సప్తసముద్రాలూ దాటి వెళ్ళేందుకు సాయపడవచ్చు. ఆ సాహసాల్లో యుద్ధాలూ, విషాదాలూ, దుఃఖాలూ వాడికి అనుభవంలోకి రావచ్చు. అలాంటి జీవితంలో వాడికి నమ్మకం, ప్రేమ, ధైర్యం తోడుగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది. అందుచేత, దయచేసి మీరు దగ్గరుండి ప్రేమతో వాడు నేర్చుకోవలసినవన్నీ నేర్పిస్తారా? వీలైతే అవన్నీ సున్నితంగా నేర్పగలరా? ఒక మిత్రుడుంటే ఒక శత్రువు కూడా ఉంటాడని నేర్పండి. అందరు మనుషులూ న్యాయంగా ఉండరనీ, అందరూ సత్యసంధులు కారనీ వాడికి తెలియాలి. ఒక దుష్టుడున్న చోట ఒక వీరుడు కూడా ఉంటాడనీ, జిత్తులమారి రాజకీయ నేత ఉండే చోటే అంకితభావంతో పనిచేసే నేత కూడా ఉంటాడనీ చెప్పండి. అప్పనంగా దొరికిన ఒక రూపాయి కన్నా సొంతంగా సంపాదించుకున్న పది పైసలు ఎక్కువ విలువైనదని నేర్పండి. స్కూల్లో మోసం చేసి గెలవటం కన్నా ఓడిపోవటం ఎక్కువ గౌరవంగా ఉంటుందని నేర్పండి. ఓడిపోయినప్పుడు చక్కగా దాన్ని అంగీకరించటం, గెలిచినప్పుడు మనస్ఫూర్తిగా ఆనందించటం నేర్పండి. అందరితో మృదువుగా ప్రవర్తించమనీ, కఠినంగా ఉన్న వాళ్ళతో కఠినంగా ఉండమనీ నేర్పండి. అసూయకు వాణ్ణి దూరంగా ఉంచగలిగితే బావుంటుంది. చప్పుడు చెయ్యకుండా నవ్వటం నేర్పండి. వాడు విచారంగా ఉన్నప్పుడు నవ్వటం నేర్పగలిగితే నేర్పండి. కన్నీళ్ళు కార్చటం అవమానమేమీ కాదని చెప్పండి. ఓటమిలో కూడా కీర్తి ప్రతిష్ఠలు ఉండవచ్చనీ, గెలుపులో నిరాశ ఉండవచ్చనీ వివరించండి. పుస్తకాలు ఎంత అద్భుతంగా ఉంటాయో నేర్పండి. అందరూ వాడి ఆలోచనలు తప్పని అన్నప్పటికీ, వాటిని తను మట్టుకు గౌరవించటం నేర్పండి. అందరూ దేన్నో అనుసరిస్తున్నా, తను అలా చెయ్యకుండా ఉండే మనోబలాన్ని మా అబ్బాయికి నేర్పండి. అందరు చెప్పేదీ వినమనీ, సత్యమనే జల్లెడతో వడబోసి మంచిని మాత్రమే గ్రహించమనీ చెప్పండి. తన ప్రతిభనీ, మేధస్సునీ ఎక్కువ ధర చెల్లించే వారికే అమ్మమని చెప్పండి కానీ తన హృదయానికీ, ఆత్మకీ వెల నిర్ణయించవద్దని నేర్పించండి. అసహనం ప్రదర్శించే ధైర్యాన్నీ, ధైర్యంగా ఉండేందుకు ఓర్పునీ కలిగి ఉండనివ్వండి. ఉదాత్తమైన ఆత్మవిశ్వాసం ఉండాలనీ, అప్పుడే మానవాళి మీదా దేవుడి మీదా వాడికి ఉదాత్తమైన విశ్వాసం ఏర్పడగలదనీ నేర్పించండి. మీకు వీలైనంత వరకూ ప్రయత్నించి వాడిని మంచి పిల్లవాడుగా మలచండి. మీరు మలచగలరు. ఇది మా నమ్మకం."

– ఇంటర్నెట్ నుంచి సేకరణ



# ప్రభుత్వ పాఠశాలల్లో భాషోత్సవాలు

సమగ్ర శిక్షా, సీమ్యాట్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో భాషోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, కథలు చెప్పడం, వక్తృత్వం, వేషధారణ, గేయాలు, డ్రాయింగ్ అండ్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల సృజనాత్మకతకు వేదికలుగా నిలిచాయి మన ప్రభుత్వ పాఠశాలలు..













# బడి

బడంటే బంతిపూల వనంలా ఉండాలి.
బడంటే చుక్కల పిల్లల్ని అక్కున దాచుకున్న నింగి తల్లిలా ఉండాలి
విరగ కాచిన జామ పండ్ల మీద చిలకలు వాలిన చెట్టులా ఉండాలి.

బడంటే పుస్తకాలు – పెన్నులు – పెన్సిళ్ళూ పరీక్షలే కాదు
బడంటే స్నేహం – బడంటే ప్రేమ – బడంటే నమ్మకం.

బడి అంటే అమ్మ ఒడిలా ఉండాలి
బుడి బుడి పాదాల తడియారని నాన్న వక్షస్థలంలా ఉండాలి.
బడంటే భయంకాదు....బడంటే బతుకు
బడంటే చదవడం చదివించడమే కాదు
బడంటే వెలగడం – వెలిగించడం
బతకడం – బతికించడం.

మునిమాపువేళ తూనీగలు తోటలోకి చొరబడినట్టు
రెక్కల నిండా పుప్పొడి అంటించుకున్న తుమ్మెదలు
చెరువు గట్టు మీద ఆటాడుకుంటున్నట్టు

నవ్వుల రవ్వలు విరజిమ్ముతూ
పిల్లలు బడిలోకి అడుగుపెట్టాలి.

బడంటే ఆట – బడంటే పాట
బడంటే సామాజిక సామూహిక స్వప్నం.

బడంటే రంగులు పూసుకున్న పసిడి పిట్టలు
తోటలో వసంతమాడుకుంటున్నట్టుండాలి
చదువుతూ నవ్వాలి నవ్వుతూ చదవాలి
బడంటే బాలపరిమళాలు నలుదిశలా వెదజల్లే
వేయిరేకుల వెలుగుపువ్వు.

బడంటే కలలు – బడంటే అలలు
బడంటే ఎదగడం – బడంటే ఎగరడం
బడంటే మనిషి – బడంటే మంచి.



– బండారు ప్రసాద మూర్తి
సీనియర్ జర్నలిస్ట్, కవి
84998 66699



Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur